రేవంత్ అసమర్థ పాలనకు నిదర్శనం బడ్జెట్

భూపాలపల్లి జిల్లా తాజా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి

కాటారం, మార్చి 19 : రేవంత్ సర్కారు అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన రెండో బడ్జెట్ ఆయన అసమర్థ పాలనకు నిదర్శనమని భూపాలపల్లి జిల్లా తాజా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణీరాకేశ్ విమర్శించారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలు తుంగలో తొక్కి కాంగ్రెస్ కార్యకర్తల జేబులు నింపడానికి, ప్రజాధనం దుర్వినియోగం చేయడానికి బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం సిగ్గుచేటన్నారు. ఆరు గ్యారెంటీల్లో యువ వికాసం పేరుతో ప్రతి విద్యార్థికి రూ.5లక్షలు విద్యా భరోసా కార్డు ఇస్తామని చెప్పి, ఇప్పుడు యువ వికాసం పథకాన్ని కాంగ్రెస్ కార్యకర్తల జేబులు నింపే పథకంగా మార్చారన్నారు. అందులో భాగంగా బడ్జెట్‌లో రూ.6వేల కోట్లు కేటాయించి, వాటిని విద్యార్థులకు బదులు కాంగ్రెస్ కార్యకర్తలకు పప్పు, బెల్లంలా పంచి పెట్టాలని చూస్తున్నారని అన్నారు. రూ.2లక్షల90వేల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టిన గత సంవత్సరంలోనే రూ.70వేల కోట్లు లోటుందని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించి, ఇప్పుడు రూ.3లక్షల 5వేల కోట్లకు ఎలా పెంచారనీ, గత సంవత్సరంతో పోల్చితే ఇప్పుడు ఆదాయం ఎలా పెరిగిందని ప్రశ్నించారు. తెలంగాణ అక్కాచెల్లెళ్లకు ప్రతి నెలా ఇస్తామన్న రూ.2500కు బడ్జెట్‌లో కేటాయింపులు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. పరిపాలన చేతకాక తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను జాతీయ స్థాయిలో దిగజార్చిన రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా అబద్ధాల పునాదుల మీద చేస్తున్న పాలనకు పుల్‌స్టాప్ పెట్టి వాస్తవంలోకి రావాలని కోరారు. అంకెల గారెడీతో ఆరు గ్యారెంటీలకు ఎగనామం పెట్టి రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులను, ఆటో డ్రైవర్లను, మహిళలను, ఉద్యోగులను సబ్బండ వర్గాలను నిండా ముంచిన బడ్జెట్ ఎందుకని ప్రశ్నించారు.

వాజేడు శివాలయం వద్ద సమావేశమైన గ్రామస్తులు

శివాలయం పునఃప్రారంభంపై చిగురిస్తున్న ఆశలు

వాజేడు, మార్చి 19 : మండలంలోని నాగారం గ్రామంలో 1976సంవత్సరంలో నిర్మించిన ఎంతో చరిత్ర కలిగిన ప్రసిద్ధ శివాలయం భక్తులతో నిత్యం కళకళలాడేది. కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలతోపాటు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ గ్రామాల నుంచి భక్తులు వచ్చేవారు. నిర్వాహకులు 2008సంవత్సరం నుంచి మూసివేయడంతో పిచ్చిమొక్కలతో శిథిలావస్థకు చేరింది. అప్పటి నుంచి ఆలయ పునఃప్రారంభంపై ఎవరూ పట్టించుకోలేదు. 16యేళ్ల అనంతరం గ్రామ యువకులు ప్రస్తుతం ఆలయంలోని పిచ్చిమొక్కలు తొలగించి శుద్ధి చేశారు. గతంలోని ఆలయ ధర్మకర్తలతో వారు బుధవారం ఆలయ పునఃప్రారంభంపై సమావేశం నిర్వహించారు. త్వరలో ఆలయాన్ని మళ్లీ యథావిధిగా తెరువాలని కోరారు. దీంతో శివాలయం పునఃప్రారంభంపై గ్రామస్తుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇంత గొప్ప కార్యక్రమానికి ముందుకు వచ్చిన యువకులను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డులు అందజేత

రివార్డులు అందిస్తున్న ఎస్పీ శబరీష్

ములుగురూరల్, మార్చి 19 : మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న వారు పోలీసుల ఎదుట లొంగిపోవాలని, అలాంటి వారికి ప్రభుత్వం తరపున అండగా ఉంటామని ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ తెలిపారు. బుధవారం ఎస్పీ తన కార్యాలయంలో లొంగిపోయిన మావోయిస్టు సభ్యురాలికి ప్రభుత్వం నుంచి మంజూరైన రివార్డు డీడీలను అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ సరేండర్ రిహాబిలిటేషన్‌లో భాగంగా ఇటీవల లొం గిపోయిన మావోయిస్టు పార్టీ నేషనల్ పార్క్ ఏరియా కమిటీకి చెందిన సభ్యురాలు అలువ స్వర్ణ అలియాస్ స్వర్ణక్క రూ.4లక్షలు, సెంట్రల్ కమిటీ సభ్యుడు దివంగత కటకం సుదర్శన్ భార్య డీవీసీఎం సభ్యురాలు పులుసం పద్మ అలియాస్ గంగక్కకు రూ.5లక్షల డీడీలను అందించినట్లు తెలిపారు.

అదుపుతప్పి కారు బోల్తా : డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

మహదేవపూర్(కాళేశ్వరం), మార్చి 19 : కారు అదుపుతప్పి బోల్తా కొట్టడంతో డ్రైవర్‌కు గాయాలైన ఘటన మండల పరిధిలోని కుదురుపల్లి బస్టాండ్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. కాళేశ్వరం నుంచి ఓ వ్యక్తి తన కారులో మహదేవపూర్‌కు వస్తుండగా కుదురుపల్లి క్రాస్ రోడ్డు వద్ద అదుపుతప్పి రహదారి పక్కన గుంతలో పడింది. కారు ముందు భాగం ధ్వంసం కాగా, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు డ్రైవర్‌ను దవాఖానకు తరలించారు.

ఓటు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు

- **అర్హులు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలి**
- **జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌శర్మ**

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, మార్చి 19 : ఓటరు జాబితా రూపకల్పన, నవీకరణకు రాజకీయ పార్టీల నాయకులు సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. బుధవారం ఐడీవోసీ కార్యాలయంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గత సంవత్సరం న వంబర్ నుంచి మార్చి 18వ తేదీ వరకు నూతన ఓటరు నమోదుకు ఫారం-6 ద్వారా 1040 దరఖాస్తులు చేసుకోగా 973 మంది దరఖాస్తులను విచారణ చేశారని, 67 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఫారం-7కు 859 రాగా 791 విచారణ జరిగిందని, 68 పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. చిరునామా మార్పునకు 950 దరఖాస్తులు వచ్చాయ ని, వాటిలో 916 విచారణ పూర్తి కాగా 34 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కరెక్షన్స్ కొరకు 1962 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో ఇప్పటి వరకు 1846 విచారణ పూర్తి కాగా, 116 పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఫారం-7 ద్వారా నోటీస్ జారీ తదుపరి మాత్ర మే ఓటు హక్కు తొలగించాలని, సుమోటోగా తొలగించడానికి అవకాశం లేదని అన్నారు. అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చడం, రెండు ఓట్లున్న ఓటర్లను తొలగించే ప్రక్రియలో రాజకీయ పార్టీలు తమ కార్యకర్తల ద్వారా సరైన ఓటరు వివరాలను అందించేందుకు ముందుకు రావాలని, ఈ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, ఇమామ్, వివి ధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులైన నిరుద్యోగులు ఏప్రిల్ 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ రాహుల్‌శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకంలో భాగంగా అన్ని కులాల వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు రూ.4లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేస్తుందని, దీనిలో కనీసం 60నుంచి 80 శాతం సబ్సిడీ కూడా అందిస్తోందని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాన్ కార్డు, పాస్ ఫొటో, ఫోన్ నంబర్ అవసరం ఉంటుందని, రేషన్ కార్డులోని సభ్యులలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పనులు వేగవంతం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

చిట్యాల, మార్చి 19 : మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు, ముచినిపర్తి గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి సూచించారు. బుధవారం ఆమె మండలంలోని లక్ష్మీపూర్‌తండా గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తనిఖీచేసి, ఆదర్శ గ్రామంగా ఎంపికైన ముచినిపర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముచ్చినపర్తిలో 64ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా 12ఇళ్లు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆమె వెంట ఎంపీడీవో జయశ్రీ, ఎంపీవో రామకృష్ణ, ఏపీవో ఆలింపాషా, పంచాయతీ సెక్రటరీ మహేశ్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్ష నేరం : డీఎంహెచ్‌వో

భూపాలపల్లి రూరల్, మార్చి 19 : లింగ నిర్ధారణ పరీక్ష చట్టరీత్యా నేరమని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ జిల్లాలో 14స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని తెలిపారు. అధికారులు లింగ నిర్ధారణ పరీక్షల నిరోధంపై దృష్టి పెట్టాలన్నారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే 9440586982కు సమాచారం అందించాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ కవిత, డాక్టర్ సురేందర్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలో పది మంది డిబార్

భూపాలపల్లి రూరల్, మార్చి 19 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు 1821మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకన్న తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 8 పరీక్ష కేంద్రాల్లో 1903మంది విద్యార్థులకు గాను 1821మంది విద్యార్థులు హాజరయ్యారని, 82మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను హైదరాబాద్ స్పెషల్ స్క్వాడ్ బృందం సందర్శించినట్లు తెలిపారు. భూపాలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల నలుగురు విద్యార్థుల, తేజస్వీని జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఆరుగురు విద్యార్థులను మాల్ ప్రాక్టీస్ కింద మొత్తం 10మందిని డిబార్ చేసినట్లు వెంకన్న తెలిపారు.

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ములుగురూరల్, మార్చి 19 : 10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ దివాకర అధికారులను బుధవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. జిల్లాలో హాజరయ్యే విద్యార్థులకు ముందస్తుగా ఆల్ ది బెస్ట్ చెప్పారు. విద్యార్థులు భయాందోళనకు గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. అధికారులు పారదర్శకంగా వార్షిక పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

వెంకటాపురం(నూగూరు)/గోవిందరావుపేట, మార్చి 19 : ఈ నెల 21వ తేదీ నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో సత్యనారాయణ బుధవారం తెలిపారు. వెంకటాపురం మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా మొత్తం 275మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. జడ్పీహెచ్ఎస్‌లో 135, ఏజీహెచ్ఎస్ చిరుతపల్లి-1 పాఠశాలలో 140 మంది విద్యార్థులు రాయనున్నట్లు తెలిపారు. గోవిందరావుపేట మండలంలో 289మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఎంఈవో దివాకర్ తెలిపారు. పస్రా నాగారం జడ్పీహెచ్ఎస్‌లో 150మంది, మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 139మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

ఇసుక సొసైటీల నిరసన ర్యాలీ

ఏటూరునాగారం, మార్చి 19 : ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాల్లోని గిరిజన ఇసుక కో ఆపరేటివ్ సొసైటీలకు జరుగుతున్న అన్యాయాలపై మండల కేంద్రంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇసుక సొసైటీలు ఏర్పాటు చేసిన సంవత్సరాలు గడస్తున్నప్పటికీ ఇసుక సొసైటీలకు డీఎల్ఎస్‌సీ నిర్వహించకుండా గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా ఇసుక పాలసీలు నడుపుతున్నారని ఆరోపించారు. గిరిజన సొసైటీల ద్వారా జరిగిన ఇసుక లావాదేవీలకు బిల్లులు చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ ఇసుక సొసైటీల ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ ఈసం రాజు, కో కన్వీనర్ రజిని, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన

భూపాలపల్లి రూరల్/ములుగురూరల్, మార్చి 19 : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశలకు ప్రభుత్వం రూ.18 వేలు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ బుధవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ముందు నిరసన చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బందు సాయిలు, దావూద్, ఆశ వర్కర్ల ఏఎన్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలాదేవి, తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కేతం విజయ, మెట్టు కొండ లక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లను బలవంతంగా భూపాలపల్లి పోలీసులు స్టేషన్‌కు తరలించారు. సీఐటీయూ నాయకులు ఆకుదార రమేశ్, ఎం రాజేందర్, ఐరెడ్డి తిరుమల, కే రాధిక, రాజేశ్వర్‌రెడ్డి, రమా, సరిత, యాకూబ్, శారద, గపూర్‌పాషా, సర్దార్‌హుస్సేన్, రవి పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క

ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగురూరల్, మార్చి 19 : అన్ని మతాలకు నిలయమైన తెలంగాణ రాష్ట్రంలో మత సామరస్యానికి పండుగలు నిదర్శనంగా నిలుస్తాయని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్‌లో జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర ఆధ్వర్యంలో ప్రభుత్వం ద్వారా అధికారికంగా నిర్వహించిన ఇఫ్తార్ విందులో మంత్రి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అన్ని మతాలకు సముచిత న్యాయం చేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చినట్లు తెలిపారు. అంతకు ముందు మంత్రి ములుగు ప్రభుత్వ దవాఖాన వద్ద మాజీ ఎంపీపీ నల్లెల్ల కుమారస్వామి జ్ఞాపకార్థం, జీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్, అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, డీపీవో దేవరాజు, ఆర్డీవో వెంకటేశ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, మైనార్టీ సంక్షేమశాఖ అధికారి రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల అధ్యక్షుడు చాందిపాషా, మాజీ ఎంపీటీసీ మావూరపు తిరుపతిరెడ్డి, నాయకులు వంగ రవియాదవ్, నల్లెల్ల భరత్‌కుమార్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

అడిషనల్ కలెక్టర్ సంపత్‌రావు

మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సంపత్‌రావు

ఏటూరునాగారం, మార్చి 19 : వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ సంపత్‌రావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాలకు చెందిన ఎంపీడీవో, ఎంఈవో, ఎంపీవో, ఆర్‌డబ్ల్యూఎస్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, హెచ్‌ఎంలతో తాగునీటి సమస్యపై సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా ఆయా గ్రామాలు, పాఠశాలలో, హాస్టల్స్‌లో ఉన్న నీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీటి పైపుల లీకేజీలు, వాటర్ ట్యాంకుల లీకేజీలు సరఫరాపై ఆరా తీశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని వై జంక్షన్‌లో ఈ మేరకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. బస్టాండు, ఐటీడీఏ వద్ద కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు స్థానిక మండల పరిషత్ అధికారులు తెలిపారు. తాగునీటి సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకపోనున్నట్లు సంపత్‌రావు అధికారులకు తెలిపారు. ఎంపీడీవోలు రాజ్యలక్ష్మి, విజయ, అనిత, సుమన వాణి, భద్రినాయక్, రాజేంద్రప్రసాద్, డీపీవో దేవరాజ్, డీఈఈ సతీశ్ పాల్గొన్నారు.

ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతించాలి

- **జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్**
- **పది పరీక్షలపై జూమ్ మీటింగ్**

భూపాలపల్లి రూరల్, మార్చి 19 : ఐదు నిమిషాలు ఆలస్యమైనా పరీక్షల కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం రాజేందర్ అన్నారు. బుధవారం నెల 21నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై డీఈవో రాజేందర్ చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాల్ టికెట్లను ఆయా పాఠశాలలకు పంపామని, ఎవరైనా హాల్ టికెట్స్ అందని విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. పరీక్షలకు సంబంధించి సమస్యలు ఎదురైతే పరిష్కరించేందుకు హైదరాబాద్ పరీక్షల విభాగం కార్యాలయంలో 24గంటలు పని చేసేలా 040-23230942 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారని, ఎవరైనా ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఐదు నిమిషాలు ఆలస్యమైన పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించాలని సూచించారు. మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించొద్దని, ఇంటర్, ఓపెన్ స్కూల్ సొసైటీ తరహాలో 24 పేజీల ఆన్సర్ బుక్‌లెట్ ఇస్తారని తెలిపారు. సైన్స్ ఈసారి రెండు వేర్వేరు రోజుల్లో (భౌతికశాస్త్రం, జీవ శాస్త్రం) నిర్వహిస్తున్నామని తెలిపారు.

నిరుద్యోగ యువకులను మోసం చేస్తున్న కాంగ్రెస్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

కృష్ణ కాలనీ, మార్చి 19 : రేషన్‌కార్డులే కుండానే రేషన్‌కార్డుల వివరాలు జోడిస్తూ రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పేరుతో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని టీఎస్ ఎమ్మార్పీఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య మండిపడ్డారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజయ్య మాట్లాడుతూ రేషన్ కార్డులు లేకుండా రాజీవ్ యువ వికాసం పథకానికి ఏ విధంగా దరఖాస్తులు అడుగుతుందో ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. ముందుగా కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసి, ఆ తర్వాత యువ వికాసం పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శీలపాక హరీశ్‌మాదిగ, మంత్రి రాజబాబు పాల్గొన్నారు.

ఉపాధిహామీని వినియోగించుకోవాలి : డీఆర్డీవో నరేశ్

మహాముత్తారం, మార్చి 19 : మెరుగైన జీవనోపాధికి జాతీయ ఉపాధి హామీ పనిని ఎంచుకోవాలని డీఆర్డీవో నరేశ్ అన్నారు. బుధవారం మండలంలోని మాదారం గ్రామంలో మామిడికుంట ఎమ్ఐ ట్యాంక్ ఫిష్ ఫండ్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈసీ నాగేందర్, డీఆర్డీవో శ్రీనివాస్, టీఏ, పంచాయతీ సెక్రటరీ, ఫీల్డ్ అసిస్టెంట్, మేట్, కూలీలు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ

బిల్లు ఆమోదంపై నాయకుల సంబురాలు

వెంకటాపూర్ : సంబురాలు జరుపుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కాటారం/టేకుమట్ల/మహదేవపూర్(కాళేశ్వరం) / వెంకటాపూర్, మార్చి 19 : మాదిగ జాతిపిత అయని మందకృష్ణ మాదిగ 30ఏళ్ల పోరాటంతోనే ఏబీసీడీ ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదిస్తూ తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం వారు సంబురాలు జరుపుకున్నారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కాటారంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంతెన చిరంజీవిమాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చంద్రగిరి అశోక్, మంతెన శ్రావన్, మంతెన శ్రీనివాస్, కోలుగూరి రాజు, కుమార్ పాల్గొన్నారు. టేకుమట్లలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రేణుకుంట్ల శంకర్, నాయకులు రాంచందర్, శ్రీకాంత్, సారయ్య, రజినీకుమార్, రాజు, రాజకొమురయ్య, రాజయ్య, మూగయ్య, సమ్మయ్య, సంపత్ పాల్గొన్నారు. మహదేవపూర్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేశ్, నాయకులు మంథెన రవితేజ, ఎమ్మార్పీఎస్ యువసేన మండల అధ్యక్షుడు చింతకుంట్ల సదానందం, బీసీ సంఘం నాయకులు గడ్డం స్వామి, వాల్మీకి సంఘం నాయకులు సుధాకర్, పాల్గొన్నారు. వెంకటాపూర్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కాడపాక శ్యామ్ ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మోరె లింగస్వామి మాదిగ, దొమ్మటి రమేశ్‌మాదిగ, చంటి భద్రయ్య, రాజేందర్, భాస్కర్, శ్రీనివాస్, దేవేందర్, రవీందర్ పాల్గొన్నారు.

టీబీ నియంత్రణకు కృషి చేయాలి

ములుగురూరల్, మార్చి19 : జిల్లాలో టీబీ వ్యాధి నియంత్రణకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు అన్నారు. బుధవారం ములుగులో టీబీ అలర్ట్ ఇండియా, సాతి స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో క్షయ వ్యాధి నిర్ధారణపై వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం డాటా ఎంట్రీ ఆపరేటర్లు, స్టాఫ్ నర్సులతో సమావేశం నిర్వహించి ఆన్‌లైన్ పోర్టల్‌లో రోగి వివరాల నమోదుపై అవగాహన కల్పించారు. సమావేశంలో టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ చంద్రకాంత్, వైద్యులు పవన్‌కుమార్, రణధీర్, శ్రీకాంత్, ప్రియాంక, శ్రవణ్, అనిల్, డెమో సంపత్, వైద్య సిబ్బంది దుర్గారావు, స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్లు రాజు, వెంకటేశ్వర్లు, జ్యోతి ఉన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన తహసీల్దార్

మంగపేట, మార్చి 19 : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం సాయంత్రం తహసీల్దార్ తోట రవీందర్ తనిఖీ చేశారు. డైనింగ్ హాల్, నిత్యావసర సరుకులు, కూరగాయలు, వంటశాల, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు.

కులాయిలకు మోటార్లు బిగిస్తే చర్యలు

భూపాలపల్లి రూరల్, మార్చి 19 : నీటి కులాయిలకు విద్యుత్ మోటార్లు బిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు పులుర్రి రామయ్యపల్లి కాలనీలో ఆయన పర్యటించారు. నీటి సరఫరాలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా..? అని కాలనీ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ రానున్న వేసవికాలం దృష్ట్యా ప్రజలకు ఎలాంటి నీటి సమస్య రాకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ బి. మానసను ఆదేశించాడు. ప్రజలు ఇబ్బందులు పడకుండా ఒక్కొక్కరికి 135 లీటర్ల నీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు